క్లుప్తంగా

క్రిస్మస్ వేడుకలకు రూ.75 వేలు అందజేత



మాచర్ల: క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిలో ఆంధ్రా లూథరన్ చర్చి, బాప్టిస్టు చర్చిలకు పురపాలక సంఘం తరఫున రూ.75వేలు చెక్కును క్రైస్తవ పెద్దలకు ప్రభుత్వ విప్ పీఆర్కే బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రతి ఏడాదిలాగే పురపాలక సంఘం నుంచి రూ.75వేలు చెక్కును అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబు, కౌన్సిలర్లు ఎం.సుందరరావు, వి.గురవయ్య, జీవన్, కార్పొరేషన్ డైరెక్టర్ మరియమ్మ, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు కె.రత్నాకర్, వి.దానియేల్, సుదర్శనరావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా బసివిరెడ్డి



కారెంపూడి: పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శిగా కారెంపూడి మండలం గాదెవారిపల్లె గ్రామానికి చెందిన బైరెడ్డి బసివిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. తనకు పదవి కేటాయించేందుకు సిఫారసు చేసిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆశయాల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని బసివిరెడ్డి చెప్పారు.

ఆశాజనకంగా కందుల ధర



కారెంపూడి: ఈసారి ప్రభుత్వమే మద్దతు ధరకు కందులు కొనే ఆలోచన చేస్తోందని త్వరలో దానిపై వ్యవసాయశాఖ అధికారులకు సమావేశం కూడా ఉందని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.యలమందారెడ్డి బుధవారం తెలిపారు. కారెంపూడి మండలంలోని మూడు వేల ఎకరాలలో కంది పంట సాగులో ఉందని పంట కూడా చాలా ఆశాజనకంగా ఉందని ఏవో తెలిపారు. ఇటీవల తుపాను వర్షాలు వర్షాధారంగా వేసిన కంది పంటకు బాగా మేలు చేశాయన్నారు. ఈ సారి కంది ఎక్కువ విస్తీర్ణంలో సాగులో ఉందన్నారు. దానికి తగినట్లుగా ధర కూడా బాగుందని, క్వింటా కందుల ధర బహిరంగ మార్కెట్లో రూ.11 వేల దాకా ఉందన్నారు. ప్రభుత్వం కూడా మిగతా పంటలతో పాటు కందులను కూడా మద్దతు ధరకు కొనే ఆలోచన చేస్తోందని తెలిపారు.

అరుదైన సన్నివేశం



కారెంపూడి: క్లాస్ మేట్స్ పోలీస్ అధికారులుగా ఉద్యోగం సాధించి శిక్షణలో కూడా బ్యాచ్ మేట్స్ అయి వారంతా ఒకే చోట పల్నాడు ప్రాంతంలోనే ఉద్యోగాలు చేస్తున్న అరుదైన సన్నివేశం ఇది. ఇటీవల కారెంపూడిలో జరిగిన పల్నాటి ఉత్సవాలలో ఉద్రిక్తతలు చెలరేగినా వాటిని అదుపు చేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు వీరంతా కృషి చేశారు. గురజాల సీఐ టి.బాలకృష్ణ, మాచర్ల టౌన్ సీఐ పి.శరత్‌బాబు, కారెంపూడి సీఐ దార్ల జయకుమార్, గురజాల ఎస్ఐ టి.అశోక్‌బాబు అందరూ కూడా మిత్రులు. పైగా ఒకే చోట పల్నాడులోనే ప్రస్తుతం ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. సీఐ శరత్‌బాబు, సీఐ జయకుమార్ క్లాస్ మేట్స్. పైగా ఈ అధికారులు నలుగురు కూడా ట్రైనింగ్‌లో బ్యాచ్ మేట్స్. ట్రైనింగ్‌లో నలుగురు ఎస్ఐలుగా శిక్షణ పొందారు. అందరూ కూడా సమస్యాత్మక పల్నాడులో శాంతిభద్రతలు పరిరక్షిస్తూ ప్రజా సేవలో ఉన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ

నకరికల్లు: మండలంలోని మిచాంగ్ తుపాను బాధిత రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దేచవరం, కుంకలగుంట, చల్లగుండ్ల, చీమలమర్రి, కండ్లకుంట, చేజర్ల, రూపెనగుంట్ల గ్రామాల్లోని పంట నష్టపోయిన రైతులకు 80శాతం రాయితీపై శనగ విత్తనాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటనష్టం వాటిల్లిన రైతులను గుర్తించడంలో ప్రభుత్వ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించారన్నారు. 33శాతంపైగా నష్టం కలిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ మండలంలో రైతులకు పంపిణీ చేసేందుకు 750 క్వింటాళ్ల శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. జేజీ-11 రకం శనగ విత్తనాలు 80 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శనగలు కేజీ పూర్తి ధర రూ.81 కాగా 80శాతం రాయితీపై కేవలం రూ.16.20కే ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేచవరం ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు కె.రవిబాబు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎంపీపీ దాసరి చౌడేశ్వరి
- మల్లవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'



మల్లవరం గ్రామంలో జగనన్న సంక్షేమ పథకాల లబ్ధిబోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చౌడేశ్వరి,

రెంటచింతల: ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన మాట తప్పని జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం రాష్ట్రానికి జగన్ అవసరం ఎందుకు కావాలంటే వివరించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లవరం గ్రామ సచివాలయం పరిధిలో ఆమె పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామంలోని వలంటీర్లు, నాయకులు ఇప్పటి వరకు వివిధ సంక్షేమ పథకాలతో ఎంత మేలు జరిగిందో ప్రతి గడపకు వివరించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం చెప్పిన హామీలను ఏ విధంగా అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేసిందో వివరించి ఆపు బాబు నాటకం-జగనే మా నమ్మకం అంటూ ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నన్నే సాహెబ్, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పమ్మి సీతా రామిరెడ్డి, ఎంపీటీసీ సేవా నాయక్, పార్టీ నాయకులు వడితే బుడ్డసైదా నాయక్, గుంగోనాయక్, ఎస్‌కే సైదా సాహెబ్, వడితే సాంబ, దొడ్డ అంజి, దొడ్డ రామయ్య, బత్తుల కొండ, సిద్దల మరియదాసు, సిద్దల ప్రభుదాసు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు

- 11 లక్షలకుపైగా పశువులకు ఆరోగ్య కార్డులు పంపిణీ
- ఇక పశువులకు వైద్యం సులభం
- జిల్లాలో 11,58,833 పశువులు



పశు ఆరోగ్య సంరక్షణ కార్డు

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలతో పాటు పశువులకు కూడా సంపూర్ణ ఆరోగ్య రక్షణ కల్పిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పేద ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించే విధంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చిన ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి ప్రాణాలను నిలబెడుతున్నారు. తాజాగా పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టింది. పశువులకు ఒక గుర్తింపు కార్డును మంజూరు చేసి వాటి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లోనే పశువుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. పశువుల వైద్యులు, సిబ్బంది మందులు ఇతర పరికరాలు పశుసంరక్షణ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. పశుపోషకులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా వారి చెంతనే ఆరోగ్య కేంద్రాలు నెలకొల్పి మూగజీవాల మౌనవేదనకు ముగింపు పలుకుతున్నారు. రోగాల బారిన పడిన పశువుల నుంచి గర్భధారణ, డెలివరీలు అత్యంత సురక్షితంగా చేసి పశు సంపదను వృద్ధి చేసేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తుంది. దీని వలన గ్రామీణ ప్రాంతాల్లోని పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పశువులకు మెరుగైన వైద్యం అందుతుందని సంతోషిస్తున్నారు.

జిల్లాలో పశు సంపద ఇలా..

పల్నాడు జిల్లాలో ఆవులు, ఎద్దులు-66,072, బర్రెలు-4,67,046, గొర్రెలు-4,69,424, మేకలు-1,56,291, పందులు-1,645, కోళ్లు-45,69,354, కుక్కలు-9,250 ఉన్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. జిల్లాలో పశువుల సంఖ్య వాటికి కావాల్సిన మందులు ఇతర అంశాలకు ఉపయోగపడేందుకు అటు ప్రభుత్వం, ఇటు రైతులకు ఉపయోగపడేలా గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని పశువుల వివరాలు ఆన్‌లైన్ చేసి హోలోగ్రామ్‌తో కూడిన పది అంకెల సంఖ్యలో పొందుపరచి రైతుకు ఇస్తారు. పశు వైద్య శాఖ వారు ఆరు పశువులకు(పెద్ద జీవాలు) ఒక ఆరోగ్య కార్డు, మేకలు/గొర్రెలు అయితే 20 జీవాలకు ఒక కార్డు, అందించారు. పశువుల ఆరోగ్య కార్డులలో పశుపోషకుని వివరాలు, పశుసంపద వివరాలు ఉంటాయి. వ్యాధుల నుంచి టీకాల వరకు సమస్త సమాచారం లభిస్తుంది. మూగజీవాలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఈ కార్డుతో చికిత్స అందించడం సులభమవుతుంది.

పశువుల ఆరోగ్యానికి రక్ష..



పశువులకు సైతం ఆరోగ్య కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్డుల వలన పశు సంరక్షణ దిశగా అడుగులు వేయవచ్చును. పశువుల ఆరోగ్య సమస్యలను ఆన్‌లైన్ ద్వారా తెలుసుకుని వాటి ఆరోగ్యానికి సంబంధించి చర్యలు చేపట్టవచ్చు. గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు, బర్రెలు వాటికి మాత్రమే ఈ కార్డులు అందించడం జరుగుతుంది. ఆరోగ్య కార్డులను సద్వినియోగం చేసుకోవాలి.

-టి.నాగమల్లీశ్వరరావు, పశు సంవర్ధక శాఖ ఏడీ

కౌశల్ క్విజ్ పోటీలలో ప్రథమ స్థానంలో గణపవరం



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలను పాఠశాల హెచ్ఎం లింగాల ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఉపాధ్యాయులు జె.పి.శాస్త్రి, నరసింహమూర్తి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కౌశల్ క్విజ్ పోటీల ద్వారా భారతీయ శాస్త్రవేత్తల కృషిని నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో మన దేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా రెండు వేల మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. జిల్లా స్థాయి ప్రథమ బహుమతి కౌశల్ క్విజ్ పోటీలలో రాజుపాలెం మండలం గణపవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నర్రా కుమార్, నూరుబాషా ఖలీఫ్, పాలపాటి స్మృతి సాధించారన్నారు. రూ.7,500 నగదుతోపాటు మెమెంటో, సర్టిఫికెట్ అందజేయటం జరిగిందన్నారు. ద్వితీయ బహుమతి ఆర్.నాగలక్ష్మి, జి.రాధిక, ఆర్.జ్ఞాన వైష్ణవిలు గెలుపొందగా వీరికి రూ.6,000, మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ బహుమతి రాజుపాలెం మండలం గణపవరం విద్యార్థిని ఎం.హరిణి, ద్వితీయ బహుమతి మాచర్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థిని షేక్ సాజిదా సాధించగా రూ.3000, రూ.2000 నగదును అందజేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కౌశల్ కో ఆర్డినేటర్ నరమాల హనుమంతరావు, జాయింట్ కో ఆర్డినేటర్ ప్రసన్నలక్ష్మి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించండి

సీఐ టి.బాలకృష్ణ

గురజాల : చేనేత, హస్తకళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సీఐ టి.బాలకృష్ణ అన్నారు. స్థానిక శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో బుధవారం గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో చేనేత హస్తకళల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ప్రాంతంలో కొండపల్లి, ఏటికొప్పాక, చెక్క బొమ్మలు, ముత్యాలు, 1గ్రామ్ జ్యువలరీలతో పాటు చిన్నారుల ఆట వస్తువులు, పోచంపల్లి, మంగళగిరి, చీరాల, డ్రస్ మెటీరియల్స్ వంటివి లభించే విధంగా ఏర్పాటుచేసిన సొసైటీ వారికి అభినందనలు తెలిపారు. ప్రస్తుత యువత విదేశీ వస్తువులపై మోజు పెంచుకుంటున్నారని స్వదేశీ వస్తువులను వాడటం లేదన్నారు. ప్రతి ఒక్కరూ హస్తకళలను ప్రోత్సహించి కళాకారులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.అనంత కృష్ణ, నిర్వాహకులు రంగ స్వామి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పనామస్మరణతో పులకించిన రెంటచింతల



విశేషంగా ఆకట్టుకున్న అయ్యప్పస్వామి పడిపూజ మండపం

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాణ్యం కాలనీ బుధవారం రాత్రి హరహర పుత్రుడు అయ్యప్పనామస్మరణతో పులకించిపోయింది. గ్రామంలో అయ్యప్పస్వామి మాలలు ధరించిన భక్తులు, గ్రామస్తులు పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గుంటుపల్లి ఆంథోని వరప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ పడిపూజ మహోత్సవంలో అనీల్‌శర్మ అయ్యప్ప స్వామివారికి 21 రకాల అభిషేకాలతో పాటు వివిధ రకాల పూజాకార్యక్రమాలు చేపట్టారు. మాలధారులు శరణం శరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ చేసిన అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతమంతా పులకించిపోయింది. వందలాది మంది స్వాములు భజనతో తన్మయత్వం చెందారు. శరణు ఘోషతో ఆ ప్రాంతమంతా భక్తి భావం నెలకొంది. అర్ధరాత్రి ఏర్పాటు చేసిన భగభగమండే నిప్పులపై గురుస్వామి ఆంథోని వరప్రసాద్ 181వ సారి, పలువురు భక్తులు నడిచి తమ భక్తి భావాన్ని చాటారు. మాలధరించిన స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ పొదుపు చేసి, సోలార్‌వైపు పయనించి పర్యావరణాన్ని కాపాడుదామని మాచర్ల విద్యుత్ సబ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు అన్నారు. బుధవారం మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ అధికారులు, సిబ్బంది కలిసి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా విద్యుత్ కార్యాలయం నుంచి రింగ్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులకు తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, విద్యుత్ రాయితీ తదితరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ ఎ.రామయ్య, దాచేపల్లి డీఈ వీరేశ్వరరావు, తొమ్మిది మండలాల విద్యుత్‌శాఖ ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా భారత్ సంకల్పయాత్ర



ధర్మవరంలో నిర్వహించిన వికసిత్ సంకల్పయాత్రలో పాల్గొన్న నేతలు

దుర్గి: గ్రామ స్వరాజ్యంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని పలువురు ప్రజా ప్రతినిధులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ధర్మవరం, శ్యామరాజపురం గ్రామ పంచాయతీల పరిధిలో వికసిత్ భారత సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. గ్రామ స్థాయిలో పథకాలను తెలియపరిచే ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగారపు వెంకట్‌రెడ్డి, శ్యామరాజపురం సర్పంచి గురుమూర్తి, ఈఓపీఆర్డీ జీఎల్ఎస్ గుప్తా, బీజేపీ మండల అధ్యక్షులు వెలిదండి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జక్కా సీతారామయ్య, అసెంబ్లీ ఇన్‌చార్జి గుమ్మడి నాసరయ్య, ఏపీఓ వెంకటేశ్వర్లు, పలువురు మండల స్థాయి అధికారులు అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల దేశభక్తి భావితరాలకు ఆదర్శం

నకరికల్లు: భరతమాత విముక్తి కోసం చిన్నవయస్సులోనే ధైర్యంగా ఉరికంబం ఎక్కిన అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల పోరాటపటిమ నేటితరానికి ఆదర్శనీయమని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల వర్ధంతి సభను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సెంటర్‌లో బుధవారం నిర్వహించారు. ముందుగా అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత్‌బచావో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు వి.కోటూనాయక్ మాట్లాడుతూ అష్ఫకుల్లాఖాన్, రాంప్రసాద్ బిస్మిల్‌ల మతాలు వేరైన స్వాతంత్ర్య పోరాటంలో కులమతాలకు అతీతంగా సాగిన వారి స్నేహం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ సైదా, భారత్ బచావో జిల్లా కార్యదర్శి షేక్ సర్దార్, పలుసంఘాల నాయకులు జయకృష్ణ, గోదా బాల, గాదెకుమారి, మౌలానా అబ్దుల్ ఖాదిర్, వినుకొండ సుభాని, లాలూ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులనూ ఆదుకోండి



అమరావతి: ఇటీవల మిచాంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులను కూడా ఆదుకోవాలని బుధవారం మండల కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో అమరావతి, మునుగోడు, నరుకుళ్ళపాడు గ్రామ సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా మండల ప్రజాసంఘాల కన్వీనర్ బి.సూరిబాబు మాట్లాడుతూ మండల పరిధిలో వాగుల పరివాహక గ్రామాల పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. శనగ, కంది, మినుము, పత్తి, మిర్చి సాగు చేసిన రైతులకు పంట నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన కౌలు రైతుల పేర్లు నమోదు చేసి, ఈ క్రాపులో నమోదు కాని పంటలకు కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఖరీఫ్, రబీలో వేసిన అన్ని పంటలకు బీమా పరిహారాన్ని రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ మొహీద్దీన్‌వలి, ఎస్‌కే రఫీ, బెల్జేపల్లి పాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఘనంగా సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



నూతనంగా నిర్మించిన బాప్టిస్టు చర్చి ఆవరణలోని కమ్యూనిటీ హాలు భవనం

మాచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. మాచర్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కేక్ కట్ చేసి, పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించి, రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తారు. అనంతరం 20వ వార్డులో ప్రభుత్వ విప్ పీఆర్కే సొంత నిధులతో నిర్మించిన బాప్టిస్టు చర్చి కమ్యూనిటీ హాలును ప్రారంభించి, కేక్ కట్ చేస్తారు. ఆయా కార్యక్రమాలకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పీఆర్కే, పీవీఆర్‌లతోపాటు, మున్సిపల్ చైర్మన్ మాచర్ల ఏసోబు, ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు, క్రైస్తవ సంఘం పెద్దలు పాల్గొంటారు. ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. రూ.60 లక్షల సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలు ప్రారంభం అనంతరం ఐదువేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని 500 మంది పాస్టర్లు పాల్గొననున్నట్లు వెల్లడించారు.

సీఎం జగన్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి

రెంటచింతల: సంక్షేమ పథకాల రథసారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గొట్టం చిన బ్రహ్మారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రమైన రెంటచింతలలోని ప్రధాన రహదారి వెంబడి నున్న వైఎస్సార్ కాంశ్య విగ్రహం వద్ద గురువారం సీఎం జగన్ పుట్టిరోజును పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు తలపెట్టిన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు పిడుగురాళ్లలో సీఎం జగన్ జన్మదిన వేడుకలు

పిడుగురాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను పిడుగురాళ్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించటం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందిగా పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

రైతుల శ్రేయస్సుకే రైతు భరోసా కేంద్రాలు



తుమ్మకోట ఆర్బీకేలో సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మార్కొండారెడ్డి

రెంటచింతల: వ్యవసాయం, అనుబంధ రంగాలలో రైతులకు మేలు చేయడంతో పాటు వారి శ్రేయస్సు కోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మకోట గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న విత్తనాలు, ఎరువులను రైతులకు సక్రమంగా అందజేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల పాటించి సాగు చేస్తున్న పంటలకు ఈ క్రాప్, ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రతికూల పరిస్థితులలో పంటలు దెబ్బతిన్న సమయంలో నష్టపరిహారం తప్పకుండా అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలను అందించడంతోపాటు పంటలకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రైతులను ఆదుకోవడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రాంత రైతులు కోరుతున్నట్లు రెంటచింతల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే విషయాన్ని, గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి, చెరువులను నీటితో నింపే విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల బాలునాయక్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పోట్ల ముత్తయ్య, ఎంపీటీసీ ఎస్‌కే సైదా, వీఆర్వో వెంకయ్య, వీపీఏ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జీవితం ఆదర్శనీయం



క్రీస్తు సందేశం ఇస్తున్న పాస్టర్ జాన్‌సుందర్

విజయపురిసౌత్: ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శనీయమని పాస్టర్ జి.దావీదు అన్నారు. విజయపురిసౌత్‌లోని గెత్సేమనే ఫ్రీ చర్చిలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ సర్వమానవాళికి జాతి, దయ, సహనం, నేర్పిన మహా అవతారం ఏసుక్రీస్తు అన్నారు. పాపాల్లో నుంచి మానవులను రక్షించేందుకు ఆ దేవుడు మనిషి రూపంలో భూమి పైకి వచ్చారని తెలిపారు. క్రీస్తు సందేశాలను సమస్త మానవాళి ఆచరించాలని సూచించారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వంకాయలపాటి రామదాసు, బీర్నీడి నాగేశ్వరరావు, ఉరవకొండ ప్రసాద్, అంకాల పున్నరత్నం, అంకాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



గెత్సేమనే ఫ్రీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్ దావీదు

ఆదినారాయణ కాలనీలో సెమీ క్రిస్మస్ వేడుకలు

కారెంపూడి: స్థానిక ఆదినారాయణ కాలనీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పలువురు పాస్టర్లు సెమీ క్రిస్మస్‌లో పాల్గొని విశ్వాసులకు క్రీస్తు సందేశమిచ్చారు. వందలాదిగా పాల్గొని దైవ ప్రార్థన చేశారు. పాస్టర్లు కె.జాన్‌సుందర్, కె.సురేష్, సుందరరావు, జాకబ్, జోసెఫ్, పాల్‌నాయక్, బెన్‌సస్, నరేంద్ర, ఇమ్మానియేలు పాస్టర్లు పాల్గొని లోక కల్యాణార్థం జన్మించిన క్రీస్తు జననం గురించి వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వచ్చిన పాస్టర్లను సన్మానించి వారికి యాకోబు దుస్తులు పంపిణీ చేశారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు



అనంతవరంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస అర్చనలు

అనంతవరం(క్రోసూరు) : మండలంలోని అనంతవరం గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రతి నిత్యం స్వామివారికి విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు పోతురాజు శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ఐదు గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం గోత్రనామ కార్యక్రమాలు, గోదా అష్టోత్తరం శ్రీదేవి భూదేవిలకు కుంకుమార్చనలు జరుపబడతాయన్నారు. ప్రతి శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి గరుడసేవ, అలాగే ప్రతినిత్యం సాయంత్రం గణపతి హోమం, వాస్తు, సుదర్శన, మృత్యుంజయ, నవగ్రహ హోమం జరుగుతాయన్నారు. ప్రతినిత్యం కూడా స్వామివారికి ప్రణవ హారతి, శంఖు చక్ర హారతి, కుంభ, నక్షత్ర హారతి ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈనెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనంలో భాగంగా శయన అలంకారితులైనస్వామి దర్శనం, దక్షిణావృత శంకు తీర్థం భక్తులకు అందించబడుతుంది. దేవాలయ ప్రాంగణం మొత్తం కూడా రంగురంగుల పుష్పాలతో అలంకరణ అలాగే 108 కలశాలతో అభిషేక కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది.